

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 30 ఏప్రిల్ 2024



నిజామాబాద్ పార్లమెంట్ బరిలో 29 మంది



- కరీంనగర్‌లో 28, పెద్దపల్లి బరిలో 42మంది
- ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థుల పోటీ
- నామినేషన్ ఉపసంహరణ ఘట్టం ముగియడంతో ఏర్పాట్లలో అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీపై క్లారిటీ వచ్చింది. నామినేషన్‌తో పాటు విత్‌డ్రా గడువు ముగియడంతో అధికారులు పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించారు. నామినేషన్ల ఉప సంహరణ సమయం ముగిసిన తర్వాత బరిలో 29 మంది పోటీలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఎన్నికల పోలింగ్ కోసం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌ల నుంచి ఏర్పాట్లను చేయడంతో పాటు ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపించిన అధికారులు ఓటరు లిస్టును కూడా ప్రకటించారు. ఈ ఎన్నికల కోసం భారీ బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర బలగాలు ఇప్పటికే జిల్లాకు రాగా వాటిని డివిజన్, మండల కేంద్రాల్లో ఉంచి బందోబస్తు కోసం వినియోగిస్తున్నారు. ఈ ఎన్నికలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ బరిలో నిలిచే అభ్యర్థులను అధికారులు ప్రకటించారు. నామినేషన్ ఘట్టం ముగియగానే అభ్యర్థులు వేసిన నామినేషన్‌లను పరిశీలించారు. మొత్తం 42 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా వారిలో 10 మంది సరైన పత్రాలు సమర్పించకపోవడంతో తిరస్కరించారు. మూడు రోజుల పాటు విత్‌డ్రాకు అవకాశం ఇవ్వగా సోమవారంతో గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్న 32 మందిలో కేవలం ముగ్గురు మాత్రమే తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. సమయం ముగిసిన తర్వాత బరిలో 29 మంది పోటీలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రధాన పార్టీలైన బీజేపీ నుంచి ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ నుంచి టి జీవన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. వీరే కాకుండా బీఎస్పీ తరఫున పుప్పాల లింబాద్రి, బహుజన లెఫ్ట్‌పార్టీ తరఫున అబ్బగోని అశోక్‌గౌడ్, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మన్సూర్ అలీ, ధర్మ సమాజ్ పార్టీ నుంచి కండెల సుమన్, యుగ తులసిపార్టీ నుంచి సాయికృష్ణమూర్తి, దళిత బహుజన పార్టీ నుంచి గోలి నరేష్, బహుజన ముక్తి పార్టీ నుంచి దేవతి శ్రీనివాస్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి బూక్యనంద్, ఇండియా ప్రజాబంధ్ పార్టీ నుంచి మొగిలి రాజ్‌కుమార్, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్‌డ్ పార్టీ నుంచి యోగేందర్‌గట్ల పోటీలో ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థులుగా కొత్తకొండ శక్తి ప్రసాద్, కోటగిరి శ్రీనివాస్, గంట చరితరావు, గోపిచంద్రయ్య, తుటుకూరు జీవన్‌రెడ్డి, దేశబోయిన లక్ష్మీనారాయణ, బీబీనాయక్, సాయినిఖిల్, ప్రశాంత్ కత్రాజు, మాలావత్ విఠల్, రాగి అనిల్, రాపెల్లి సత్యనారాయణ, రా పెల్లి శ్రీనివాస్, వేముల విక్రమ్‌రెడ్డి, సయ్యద్ అస్గర్‌లు బరిలో నిలిచినట్లు రిటర్నింగ్ అధికారి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రకటించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ సమక్షంలో అభ్యర్థులతో అధికారులు భేటీ అయ్యారు. తెలుగు అక్షరాల క్రమసంఖ్యను బట్టి గుర్తులను కేటాయించారు. ఈ ఎన్నికల్లో నామినేషన్ వేసిన రఘు, నవీన్, పోతు నాగార్జున తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు.

'పెద్దపల్లి' బరిలో 42 మంది..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 42మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసే నాటికి ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నారు. ఈ నియోజకవర్గానికి మొత్తం 63 మంది అభ్యర్థులు 109 సెట్లలో నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 14 మంది అభ్యర్థులకు చెందిన 23 నామినేషన్ సెట్లను తిరస్కరించారు. మిగిలిన 49 మంది అభ్యర్థుల్లో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 42 మంది పోటీలో ఉన్నారు. ఇందులో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు బీఎస్పీ, ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు సైతం పోటీ చేస్తున్నారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో 17 మంది అభ్యర్థులు పోటీపడగా, ఇప్పుడు ఆ సంఖ్య రెండింతలు దాటింది. పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే.. ఇరుకుల్ల రాజయ్య -బీఎస్పీ, ఈశ్వర్ కొప్పుల-బీఆర్ఎస్, వంశీకృష్ణ గడ్డం- కాంగ్రెస్, శ్రీనివాస్ గొమాసే- బీజేపీ, ఇరుగురాల భాగ్యలక్ష్మి - పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, అంబోజు సుమలత- అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ, కనకయ్య ముల్కల-సోషలిస్టు పార్టీ ఇండియా, కాశి సతీష్‌కుమార్-యాంటి కరప్షన్ డెమొక్రటిక్ పార్టీ, కంది చందు-రాష్ట్రీయ మానవ్ పార్టీ, చిలుక ఆనందర్ - యువతరం పార్టీ, దుర్గం సంతోష్ - ప్రజా రాజ్య సమితి, రాంచందర్ నిచ్చకోల- దళిత బహుజన పార్టీ, మొలుగు వెంకటేశ్ - న్యూ ఇండియా పార్టీ, మోతె నరేశ్ - ప్యూపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా, రమేష్ మంద- ధర్మ సమాజ్ పార్టీ, వేణుగోపాల్ మొయ్యి - బహుజన్ ముక్తి పార్టీ పలువురు స్వతంత్రులు పోటీపడుతున్నారు.

కరీంనగర్ ఎంపీ బరిలో 28 మంది..

కరీంనగర్ టౌన్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఉపసంహరణల అనంతరం 28 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పమేలాసత్పతి అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా 24 మందికి గుర్తులు కేటాయించారు. మొదట తొమ్మిది మంది రిజిస్టర్డ్ అన్ రికగ్నైజ్డ్ పొలిటికల్‌పార్టీల అభ్యర్థులకు గుర్తులు కేటాయించి, అనంతరం 15 మంది స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. బీజేపీ అభ్యర్థిగా బండిసంజయ్‌కుమార్, మారెపల్లి మొగిలయ్య బిఎస్‌పి, బోయినపల్లి వినోద్‌కుమార్ బిఆర్ఎస్, వెలిచాల రాజేందర్‌రావు కాంగ్రెస్, కర్రాల అనిల్‌రెడ్డి నేషనల్ నవక్రాంతి పార్టీ, తాళ్లపల్లి అరుణ అయియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ, పంచిక అశోక్ సోషల్ జస్టిస్‌పార్టీ ఆఫ్ ఇండియా, చింత అనిల్‌కుమార్ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, చిలువేరు శ్రీకాంత్ ధర్మసమాజ్‌పార్టీ, చీకోటి వరుణ్‌కుమార్ గుప్తా తెలుగు కాంగ్రెస్ పార్టీ, పోడిశెట్టి సమ్మయ్య బహుజన్ ముక్తి పార్టీ, రాణాప్రతాప్ గట్టు సోషలిస్ట్ పార్టీ (ఇండియా), పెద్దపల్లి శ్రావణ్ భారతీయ యువకుల దళం నుంచి పోటీ చేస్తుండగా పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకర్‌కు ప్రభుత్వ విప్ అభినందన



రిషితను అభినందిస్తున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, ఏప్రిల్ 29: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్ర స్థాయి రెండవ ర్యాంక్ సాధించిన సుద్దపల్లి విద్యార్థిని కోల రిషితను ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం అభినందించి శాలువాతో సత్కరించారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు కోల తిరుపతి కుమార్తె రిషిత ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. ఈ మేరకు సోమవారం క్యాంపు కార్యాలయానికి పిలిపించి విద్యార్థిని అభినందించి శాలువాతో సత్కరించి మరింత పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ ఆలయానికి నీరు తీసుకొస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 29: మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవ జాతర ఘనంగా కొనసాగుతోంది. సోమవారం ఉదయం ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను పురోహితుడు నిర్వహించారు. అనంతరం పుట్ట బంగారు ఎల్లమ్మకు జలాభిషేకం, ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జాతరలో పాల్గొనగా పురోహితులు, నాయకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని బావి నుంచి తీసుకొచ్చిన జలాన్ని నెత్తిన ఎతుకొని పుట్ట బంగారం అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పాల్గొని అమ్మ వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పుట్ట బంగారం అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, పుల్ల జగన్‌గౌడ్, పాక నర్సయ్య, లక్ష్మణ్, గీత కార్మికులు, గౌడ కులస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల కోసం సూక్ష్మ పరిశీలకుల కేటాయింపు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

ధర్మపురి, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం సూక్ష్మ పరిశీలకులను కేటాయించినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. ధర్మపురి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ చేశారు. జిల్లా పరిధిలో గల కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి (ఎస్సీ), చొప్పదండి (ఎస్సీ), వేములవాడ నియోజకవర్గాలకు 116 మంది సూక్ష్మ పరిశీలకులను కేటాయించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు రవీష్‌గుప్తా, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దివాకర, ఆర్‌డీవోలు మధుసూదన్, ఆనంద్‌కుమార్, ఎల్‌డీఎం వెంకటరెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, కలెక్టర్ పరిపాలన అధికారి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను సందర్శించిన జనరల్ అబ్జర్వర్

ధర్మపురి, ఏప్రిల్ 29: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల ధర్మపురి నియోజకవర్గ పోలింగ్ బూత్‌లను సోమవారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవీష్‌గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల పోలింగ్ బూత్‌లను సందర్శించి, మౌలిక వసతులు గురించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అదనపు ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దివాకర్, ధర్మపురి తహసీల్దార్ కృష్ణచైతన్య, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలి





మాట్లాడుతున్న జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, జగ్గసాగర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి టి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ అన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్, అయోధ్య గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలకు రూ.400 కూలీ పెంచి ఎండాకాలంలో అదనంగా రూ.50 ఇచ్చేందుకు మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. బీడీ కార్మికుల కోసం జగిత్యాలలో పీఎఫ్ ఆఫీస్, ఆస్పత్రిని నిర్మిస్తానని, జిల్లా కేంద్రంలో పాస్‌పోర్ట్ ఆఫీస్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపుతా నని జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, చేతి గుర్తుపై ఓటు వేసి జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జీవన్‌రెడ్డికి ముదిరాజ్‌ల మద్దతు..

మెట్‌పల్లి రూరల్: మండలంలోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. మద్దతు ప్రకటించిన పత్రాన్ని సోమవారం పార్టీ కోరుట్ల ఇంచార్జి జువ్వాడి నర్సింగరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేయడానికి ముదిరాజ్ కుల సంఘం తీర్మానం చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పిడుగు తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించండి

బీర్‌పూర్, ఏప్రిల్ 29: నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఓటర్లను కోరారు. సోమవారం బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, తుంగూర్ గ్రామాల్లో ఉపాధి కూలీలు చేస్తున్న పనుల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేనిఫెస్టోను కూలీలకు చదివి వినిపించారు. అనంతరం నర్సింహులపల్లి గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేసి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, కొలుముల రమణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారపాక రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరుతూ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ రూరల్ మండలంలోని లక్ష్మీపూర్, జాబితాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు ఇచ్చినహామీ మేరకు పనిదినాలు, కూలీ పెంచేవరకు వారి పక్షాన పోరాడుతామని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటువేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ఓటు అభ్యర్థిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వసంత

రిజర్వేషన్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా?

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలు
- కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రిజర్వేష్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా అంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయ కులకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. రిజర్వేషన్ల రద్దుపై ప్రమాణానికి సిద్ధమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దమ్ముంటే దేవుడి ఎదుట ప్రమాణం చేద్దాం రండి అంటూ డేట్, టైం వేదిక మీరే డిసైడ్ చేయాలని సవాల్ విసిరారు. ఓడిపోతామనే భయంతోనే ఆ రెండు పార్టీలు కలిసి విష ప్రచారం చేస్తున్నాయన్నారు. రెండు పార్టీలు ఒకే స్వరాన్ని వినిపిస్తు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయన్నారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అనుగుణంగా రిజర్వేషన్లను బీజేపీ ప్రభుత్వం యథాతథంగా కొనసాగిస్తుందన్నారు. ఇదే విషయంపై ప్రమాణం చేసేందుకు సిద్ధమని, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కూడా ఒప్పించి తీసుకు వస్తానన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ భూస్థాపితం కావడానికి ప్రధాన కారణం కేటీఆర్ అన్నారు. ప్రజలు ఛీకొట్టినా అహంకారం తగ్గడం లేదన్నారు. జూన్ 4 తర్వాత బీఆర్ఎస్ పార్టీని పాతాళంలోకి తొక్కబోతున్నారన్నారు. కేటీఆర్ అక్రమాస్తులు, అరాచకాల చిట్టాను విప్పుతామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తూ ఒకే స్వరంతో బీజేపీని విమర్శిస్తున్నారన్నారు. ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెబుతారన్నారు.

జగిత్యాలలో విస్తృత తనిఖీలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 29: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. 20 లీటర్ల అక్రమ మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు నరేష్, మన్మధరావు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 29: నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జీవన్ రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు 10, 39 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్, నరేష్, రాజిరెడ్డి, రాజన్న, వెంకటి, విజయ్, శంకర్, రాజు, సాయి, కిషోర్, రవి తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్స్ షాపు డీలర్లు నిబంధనలు పాటించాలి

ధర్మపురి, ఏప్రిల్ 29: ఫర్టిలైజర్స్ షాపు డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి బి వాణి అన్నారు. ధర్మపురి శివారులో గల నర్సయ్యపల్లె రైతు వేదిక వద్ద ధర్మపురి, గొల్లపల్లి, పెగడపల్లి, బుగ్గారం, వెలగటూర్ మండలాల ఫర్టిలైజర్స్ షాపు డీలర్లతో సోమవారం ఆమె అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంలో డీలర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆమె తెలిపారు. డీలర్లు లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని, బిల్లు బుక్కులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. సమావేశంలో ధర్మపురి ఏడీఏ సీహెచ్ రాంచంద్రం, ఐదు మండలాల ఫర్టిలైజర్స్ డీలర్లు, ఏఈవో మౌనిక పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మవద్దు

- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 29: బీజేపీ, కాంగ్రెస్ నాయకుల గారడి మాటలను ప్రజలు నమ్మవద్దని, ఆరు గ్యారెంటీ హామీలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కందుగుల, కనుకులగిద్దె గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా కనీసం నవోదయ పాఠశాలను కేంద్రం నుంచి తీసుకరాలేదన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో రెండేళ్లకు ఒక్క సీఎం మారుతాడని ఆరోపించారు. ఆరు గ్యారెంటి హామీలతో అధికారంలోకి వచ్చాక, ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. 2014-19 వరకు ఎంపీగా ఉన్న సమయంలోనే కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా, జాతీయ రహదారి, నూతన రైల్వేలైన్ల ఏర్పాటు విషయంలో పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో పైసా పనిచేయలేదన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

వీణవంక, ఏప్రిల్ 29: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పశుగ్రాసం కాలిపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన రవీందర్ బ్రాహ్మణపల్లిలో గడ్డి కొనుగోలు చేసి సోమవారం వ్యాన్(టీఎస్12 యూడీ 1470)లో తీసుకెళ్తున్నాడు. గ్రామ శివారు నుంచి వ్యాన్ వెళ్తుండగా విద్యుత్ తీగలు గడ్డికి తగిలాయి. రాపిడికి మంటలు లేచి అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకునే సరికి గడ్డి మొత్తం కాలిపోయింది. వ్యాన్‌సైతం 70శాతం కాలిపోయింది.

తనిఖీల్లో మద్యం పట్టివేత

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండలంలోని మల్యాల గ్రామ శివారులో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టిబడింది. హనుమకొండ జిల్లా నడికూడ మండలానికి చెందిన పామెర రమేశ్ అనే వ్యక్తి మోటర్ సైకిల్‌పై రూ. 9,500 విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్



ధ్వంసమైన డివైడర్

కోరుట్ల, ఏప్రిల్ 29: పట్టణంలోని జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన డివైడర్‌ను సోమవారం వేకువజామున వ్యాన్ ఢీకొట్టింది. దీంతో సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసి గోడ పూర్తిగా దెబ్బతిని దానికి అనుకొని ఉన్న విద్యుత్ స్తంభం కొంత మేర రోడ్డుకు ఒక వైపు ఒరిగింది. ప్రమాద సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మున్సిపల్ ఏఈ లక్ష్మి సంబధింత విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ కిరణ్ కుమార్ పరిశీంచి విచారణ చేపట్టారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నాలుగు రోజులు జైలు శిక్ష

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 29: అతిగా మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడ్డ కేసులో ఒకరికి జగిత్యాల కోర్టు న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. జిల్లాలోని గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లికి చెందిన తుమ్మ మధుకర్ అనే వ్యక్తి మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రంకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- బద్దిపోచమ్మకు మొక్కు చెల్లింపు

వేములవాడ, ఏప్రిల్ 29: ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో వేములవాడ పుణ్యక్షేత్రం కిటకిట లాడింది. ఈ సందర్భంగా వారు తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. సోమవారం సందర్భంగా ఆలయ అధికారులు లఘు దర్శనం అమలు చేయడంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్య లో భక్తులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామి వారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం, భీమేశ్వరాలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయాయి. పెద్దసంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కంప్యూటర్ వర్క్‌పేరిట సైబర్ మోసాలు

- కంబోడియాలో నరకయాతన అనుభవించిన బాధితుడు - ఇంటికి చేర్చిన పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29: 'కంప్యూటర్ వర్క్ పేరిట సైబర్ మోసాలకు సంబంధించిన కాల్స్ చేయించారు. ప్రతీ రోజు 16గంటలు పనిచేయించారు. ఇంటికి వెళ్తానంటే పాస్‌పోర్ట్ ఇవ్వలేదు. కంబోడియాలో నరకయాతన అనుభవించాను' అని సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామానికి చెందిన బాధితుడు అతికం శివ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. సిరిసిల్ల పట్టణం పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మీ తన కుమారుడు శివప్రసాద్ కంబోడియాలో ఇబ్బందులు పడుతున్నాడని గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేయడంతో ఎస్పీ అఖిల్ మహాజన్ చొరవ తీసుకున్నారు. కంబోడియాలో సైబర్ ముఠా చెరలో చిక్కుకున్నట్లు తెలుసుకున్న పోలీసుల కృషి ఫలితంగా శివప్రసాద్ ఆదివారం రాత్రి క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. కంబోడియాలో పడిన ఇబ్బందులపై సోమవారం ఓ వీడియో విడుదల చేశాడు. ముందుగా తన విడుదలకు కృషి చేసిన ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. అనంతరం తన ఆవేదనను చెప్పుకొచ్చాడు. ఉద్యోగ అన్వేషణలో భాగంగా విదేశాలకు వెళ్లాలనుకున్న తాను కొడిమ్యాలకు చెందిన ఏజెంట్‌ను కలిశానని, కంబోడియాలో కంప్యూటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి చైనీస్ కంపెనీ పేరిట ఉన్న కాల్ సెంటర్‌లో పెట్టించాడని పేర్కొన్నాడు. అక్కడ సైబర్ మోసాలకు పాల్పడే పనులు చేయించారని చెప్పాడు. కంబోడియాలో వందలాది మంది యువకులు తనలాగే నరకం అనుభవిస్తున్నారని, ఇలాంటి బాధలు ఎవరికీ రావద్దని ఆవేదన వ్యక్తం చేశాడు. నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు విదేశాలకు వెళ్లేవారు అనుమతి ఉన్న ఏజెన్సీలను ఆశ్రయించాలని కోరాడు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి

చందుర్తి ఏప్రిల్ 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చందుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం (55) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేశం ఆదివారం చందుర్తి నుంచి మోత్కురావుపేటకు తన ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తున్నాడు. చందుర్తి శివారులోని రైతు వేదిక వద్ద రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పల వద్ద రోడ్డుపై అడ్డుగా పెట్టిన బండరాళ్లను తప్పించబోయాడు. దీంతో ట్రాక్టర్ ధాన్యం కుప్పల పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవింగ్ చేస్తున్న మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మల్లేశం మృతిపై ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు.

ఆస్తి కోసం తండ్రిపై తనయుడు దాడి

మల్లాపూర్, ఏప్రిల్ 29: మండలంలోని అడవి రేగుంట గ్రామానికి చెందిన రాజారెడ్డిపై ఆస్తి పంపకాలు చేయాలని తనయుడు శేఖర్ సోమవారం దాడికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రాజారెడ్డితో ఆస్తి పంచి ఇవ్వాలని కొంత కాలం నుంచి కొడుకు శేఖర్ గొడవ పడుతున్నాడు. సోమవారం ఆస్తి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రాజారెడ్డి తన భూమికి చెందిన పట్టా పాస్ బుక్కును తీసుకొని బ్యాంకుకు వెళ్లేందుకు గ్రామంలోని బస్టాండుకు చేరుకున్నాడు. బస్టాండ్‌లో ఉన్న రాజారెడ్డిని గమనించిన శేఖర్ పారాతో తలపై దాడి చేశాడు. దీంతో రాజారెడ్డి తీవ్ర రక్తస్రావంతో కిందపడిపోయాడు. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం



కళాకారులను సన్మానిస్తున్న వీసీ సంకసాల మల్లేష్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 29: జానపద కళలకు పుట్టినిల్లు భారతదేశం అని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య సంకసాల మల్లేష్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘ అధ్యక్షుడు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో వీసీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో ఆసక్తి కలిగిన పిల్లలకు, యువతీ యువకులకు మన శాస్త్రీయ కళలను నేర్పించడానికి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. సభాధ్యక్షులు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ కళలను భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. పాశ్చాత్య కళలకు ఆకర్షితులవుతున్న నేటి యువత మన కళా వైభవాలను మరిచి పోవడం బాధాకరమన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారులు, డ్యాన్స్ మాస్టర్ రతన్ కుమార్ మాట్లడుతూ వారానికి లేదా పక్షానికి ఒక రోజు కరీంనగర్‌లో మన తెలంగాణ పేరిణి శివతాండవం, పేరిణి లాస్య శిక్షణా తరగతులను ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి గల యువత నాట్యాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ప్రముఖ నృత్య కళాకారులు ఇంజనీరు రతన్ కుమార్, నంది పురస్కార గ్రహీత, గిన్నీస్ రికార్డు హోల్డర్ శాస్త్రీయ నర్తకి కుమారి స్నేహితలను ఆచార్య మల్లేష్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు.

తప్పుడు ధ్రువపత్రాలతో భూ కబ్జాకు యత్నం

చొప్పదండి, ఏప్రిల్ 29: తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసేందుకు యత్ని స్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండిలోని సర్వే నంబరు 439, 440, 441 లో సుద్దాల వెంకటస్వామి అనే వ్యక్తి రెండు గుంటల భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం వెంకటస్వామి మహేందర్‌రెడ్డి అనే వ్యక్తికి విక్రయించాడు. అనంతరం పలువురు కొనుగోలు, అమ్మకాలు జరిపారు. కొంత కాలం తరువాత ఆ భూమిని చొప్పదండికి చెందిన కృష్ణహరి కొనుగోలు చేశాడు. కాగా సుద్దాల వెంకటస్వామి ఆ భూమి తనదేనని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఇంటి నిర్మాణానికి పర్మిషన్ పొందాడు. అనంతరం తనను మోకాపైకి రానివ్వకుండా వెంకటస్వామి బెదిరి స్తున్నాడని కృష్ణహరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దీనిపై విచారణ జరిపి సుద్దాల వెంకటస్వామి, అతడి భార్య తరుణిపై కృష్ణహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వెంకటస్వామి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

జగిత్యాలలో ఏసీబీకి చిక్కిన హెడ్‌కానిస్టేబుల్



పట్టుబడ్డ హెడ్‌కానిస్టేబుల్ మనోహర్

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29: జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ పోలీ స్టేషన్‌లో హెడ్‌కాని స్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సామి ల్ల మనోహర్ రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల మం డలం పెరుకపల్లి గ్రామానికి చెందిన బాల తిరుపతి నాలుగు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. దుబాయ్ వెళ్లకంటే ముందు ఓ భూవివాదం కేసులో నేరస్థుడుగా ఉన్నాడు. ఈ కేసు విషయంలో తిరుపతిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీకాగా కోర్టుకు గైర్హాజరయ్యాడు. ఈ కేసు విషయమై బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ దగ్గర రూ.5 వేలు డిమాండ్ చేయగా ఈ నెల 16వ తేదీన గూగుల్‌పేద్వారా రూ. 5 వేలు రూపాయలను హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ కు పంపించాడు. ఇవే కాకుండా మరో రూ.5 వేలు అదనంగా లంచం కావాలని హెడ్‌కానిస్టేబుల్ బాధితుడి మామ కట్కం గంగాధర్‌ను బలవంతం చేశాడు. దీంతో దుబాయ్ నుంచి బాధితుడు తిరుపతి ఏసీబీ డీజీపీకి మెయిల్ ద్వారా హెడ్‌కాని స్టేబుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో జగిత్యాల మండలం లోని పెరుకపల్లి రాజీవ్‌చౌరస్తా వద్ద బాధితుడు తిరుపతి మామ కట్కం గంగాధర్ వద్ద నుంచి హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ రూ. 5 వేలు లంచం తీసుకుం టుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు క్రిష్ణకుమార్, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

సెమీఫైనల్స్‌కు చేరిన ఫుట్‌బాల్ పోటీలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 29: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, ఆదిలాబాద్, కరీంనగర్, రంగారెడ్డి జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. వనపర్తి, నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో వనపర్తి జట్టు, రంగారెడ్డి, వరంగల్ జట్ల మధ్య జరిగిన పోటీలో రంగారెడ్డి, రంగారెడ్డి, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోటీలో కరీంనగర్ జట్టు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం సెమీఫైనల్స్ పోటీలు అనంతరం సాయంత్రం ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్‌ప్రెసిడెంట్ నాయుడు, కోశాధికారి సామల సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేష్ పాల్గొన్నారు.



మ్యాచ్ ఆడుతున్న వనపర్తి, నల్గొండ జట్లు

చరిత్ర పరిశోధకుడు శ్రీనివాసరాజు మృతి



శ్రీనివాసరాజు(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 29: కరీంనగర్‌లో నివాసముంటున్న రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వేంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చరిత్ర పరిశోధకుడు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు(61) శనివారం మధ్యాహ్నం ఓప్రైవేట్ ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో పూర్తయ్యాయి. శ్రీనివాసరాజుకు భార్య విజయలక్ష్మి, కుమారులు కీర్తిచంద్ర, శ్రీచైతన్య ఉన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో టైపిస్టుగా చేరిన ఆయన కరీంనగర్, పెద్దపల్లి, చొప్పదండి, కాటారం ప్రభుత్వ కళాశాలల్లో ఉపన్యాసకునిగా, ప్రాచా ర్యునిగా పనిచేస్తూ చొప్పదండిలో 2020లో పదవీ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ తీసుకున్నారు. ప్రిన్సెస్ యశోధర చారిత్రక నాటకం, ముసునూరి కాపయనాయకుడు చారిత్రక పరిశోధక నవల, భరతావని చారిత్రక కావ్యం, బహద్దూర్ కొండాలరాయుడు చారిత్రక నవల, బొమ్మలమ్మగుట్ట చక్రేశ్వరీదేవి శతకం, హిస్టరీ ఆఫ్ డస్టెన్స్ ఎడ్యుకేషన్, మానవ జీవన సంరక్షణ కవితలు, భగవద్గీత-సోపానములు (అనువాదం) వంటి పుస్తకాలను రచించారు. శ్రీనివాసరాజు మృతి పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన కవులు, రచయితలు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్జిత సేవల బుకింగ్ క్లర్క్‌పై దాడికి యత్నం

వేములవాడ, ఏప్రిల్ 29: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆర్జితసేవల బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న క్లర్క్‌పై భక్తులు దాడికి యత్నించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రాజన్న ఆలయంలో భక్తులు నిర్వహించే ఆర్జిత సేవలలో భాగంగా నిత్యం స్వామివారి నిత్య కల్యాణం జరిపిస్తుంటారు. ఆలయం తూర్పు భాగంలో ఉన్న కళాభవన్‌లో నిర్వహించే స్వామివారి నిత్యకల్యాణం కోసం భక్తులకు రోజూ గరిష్ఠంగా 150 నుంచి 160 టికెట్ల వరకు విక్రయిస్తారు. ఒక టికెట్‌పై ఒక జంటను లేదా ఇద్దరిని అనుమతిస్తారు. రద్దీ తక్కువగా ఉన్న రోజుల్లో టికెట్లు కొనుగోలు చేసిన వారి కుటుంబ సభ్యులను కూడా అనుమతిస్తారు. సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో 157 టికెట్లు జారీ చేశారు. వీటికి నాలుగు శాశ్వత కల్యాణం టికెట్లు తోడు కావడంతో మొత్తం టికెట్ల సంఖ్య 161కి చేరింది. దీంతో స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపివేశారు. అప్పటికే చాలాసేపటి నుంచి స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం క్యూ లైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు వాగ్వాదానికి దిగి ఆగ్రహానికి లోనయ్యారు. ఈ క్రమంలో బుకింగ్ కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు అక్కడికి చేరుకుని భక్తులను శాంతింపజేశారు. స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారా యణ వ్రతం తదితర ఆర్జిత సేవల టికెట్ల జారీ విషయంలో భక్తులకు తగిన సమాచారం ఎప్పటిక ప్పుడు అందించకపోవడంతో తరచూ భక్తులు గొడవ దిగుతున్నారని ఆలయ సిబ్బంది వాపోయారు. ఆర్జిత సేవల టికెట్ల జారీకి సంబంధించిన ఒక నిర్దిష్టమైన విధానాన్ని రూపొందించి అమలు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 23మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర .5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తప్పిపోయిన మహిళను కుటుంబానికి అప్పగించిన పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: ఎనిమిదేళ్ల క్రితం తప్పిపోయిన దోమల రాములమ్మను గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని గాలిపెల్లి గ్రామానికి ఆదివారం రాత్రి గుర్తుతెలియని మహిళ వచ్చిందనే సమాచారంతో పోలీసులు వెళ్లారు. విచారించగా తనపేరు రాములమ్మ అని తెలిపింది. దీంతో పోలీసులు సిరిసిల్లలోని సఖిసెంటర్‌కు పంపించారు. సోమవారం మహిళకు సంబంధించిన వివరాలు సేకరించగా ఖమ్మం జిల్లావాసిగా గుర్తించారు. ఖమ్మం జిల్లా ముదిగొండ పోలీసులు సమాచారం ఇవ్వగా వారు కిష్టాపూర్ గ్రామపెద్దలకు విషయం చెప్పారు. దీంతో రాములమ్మ కుమార్తె రమాదేవి సిరిసిల్లకు చేరుకుంది. తన తల్లి ఎనిమిది సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లిందని, మతిస్థిమితం సరిగా ఉండదని తెలిపింది. తప్పిపోయిన తన తల్లిని అప్పగించినందుకు ఎస్సై, సఖిసెంటర్ నిర్వాహకులకు కృతజ్ఞతలు చెప్పింది.

విద్యార్థుల కోసం టెలీమానస్ ఏర్పాటు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 29: పదో తరగతి(ఎస్ఎస్‌సీ) పరీక్షా ఫలితాలు వెలువడుతున్న దృష్ట్యా ఫెయిల్ అయిన విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు టెలీమానస్ పేరుతో టోల్ ఫ్రీ నంబరు 14416 ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు మనోధైర్యం కోల్పోకూడదని, తిరిగి పరీక్ష రాసి పాసయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకూడదని, ఒత్తిడి జయించాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులు వైద్యుల సలహాలు సూచనలకు టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 29: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా వెంచర్ చేసి సీసీ రోడ్డు వేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వృద్ధాశ్రమం సందర్శించిన జడ్జి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29: నగరంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమం, స్వధార్ హోమ్, బాలసదన్, శిశు గృహాలను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యవ్వనంలో ఆకర్షణకులోనై దానిని ప్రేమగా భావించి కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదువుకొని జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత ప్రేమ గురించి ఆలోచించాలని చెప్పారు. అప్పటి వరకు చదువుపై శ్రద్ధవహించాలని కోరారు. బాల్యం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలసదన్ పిల్లలకు సూచించారు. పాఠశాల నుండి వచ్చిన వెంటనే పరిశుభ్రతను పాటించాలని అన్నారు. శిశు గృహం పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, పిల్లలకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తనుకు మహేశ్, వృద్ధాశ్రమం, స్వధార్ హోం, బాలసదన్ నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 29: బీజేపీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం రైల్వేస్టేషన్ వద్ద హమాలీ సంఘం కార్యాలయంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాసెట్టి లక్ష్మయ్య, గాండ్ల రమేష్, దాసరిప్రభాకర్, గందు మహేందర్, ఐతము రఘుపతి, జెట్టి రాజు, బొడ్డు శంకరయ్య, గాండ్ల రవీందర్, తంగెళ్లపల్లి రాజు, కాసెట్టి శ్రీనివాస్, తంగెళ్లపల్లి స్వామి,తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే సత్యం

మల్యాల, ఏప్రిల్ 29: మండలంలోని ముత్యంపేట, మల్యాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. బీఆర్ఎస్ నాయకుడు మ్యాక లక్ష్మణ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, మల్యాల మాజీ ఉపసర్పంచ్ మంద తిరుపతిగౌడ్, నల్లపు మల్లేశం తదితరులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, నర్సింహరెడ్డి, మిర్తి శ్రీనివాస్, ప్రశాంత్, కొక్కుల నాగభూషణం, యాగండ్ల సుమన్‌గౌడ్, బోజగాజు నాగరాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు

కొత్తపేట గ్రామ బీజేపీ అధ్యక్షుడిగా రంజిత్

రాయికల్, ఏప్రిల్ 29: మండలంలోని కొత్తపేట గ్రామ బీజేపీ అధ్యక్షుడిగా తునికి రంజిత్‌ను నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నియామక పత్రం అందజేశారు. పార్టీ పటిష్టానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఆకుల మహేష్, నాయకులు రంజిత్ కుమార్, రాజేష్, మందుల నాగరాజు, నరేష్, రవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 29: మండంలోని రాజేశ్వరరావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవరాజు భారతి(51) గుండెపోటుతో మృతి చెందారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన దేవరాజు భారతి ఇంట్లో ఉన్న సమయంలో గుండె నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భారతి మృతిపై ఎంపీపీ మారు సాయిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29: తెలంగాణ జన సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. టీజేఎస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడు ఏశాల గంగారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజ సమస్యల పోరాటంపై టీజేఎస్ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ మండల అధ్యక్షుడు కంతి రమేష్, నాయకులు గూడ రాజరెడ్డి, దిలిప్ కుమార్, మల్లయ్య,దశరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన బద్దం శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ సోమవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొడిపల్లి గోపాల్‌రెడ్డికి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావుకు, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు ధన్యవాదాలు తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డిని కలిసి పలువురు అభినందించారు.

వీరయ్య మరణం బీజేపీకి తీరని లోటు

- మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 29: భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ముగ్గు వీరయ్య మరణం పార్టీ, గ్రామానికి తీరని లోటని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని మేడిపల్లిలో నిర్వహించిన మాజీ సర్పంచు వీరయ్య సంతాప సభలో పాల్గొన్నారు. వీరయ్య చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ వీరయ్య సర్పంచు సమయంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం, దేవాలయాల నిర్మాణం, గ్రామాభివృద్ధి పనుల కోసం నిరంతరం కృషి చేసే గొప్ప నాయకుడన్నారు. భాగవతుల కులం గుర్తింపు కోసం, గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, బీజేపీ, బీజేవైఎం మండలాధ్యక్షులు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, పీసు రాజేందర్‌రెడ్డి, ఏలేటి ముత్యంరెడ్డి, మారంపల్లి శ్రీనివాస్, ఇల్లెందుల శ్రీనివాస్, గడ్డం రాజారెడ్డి, బద్దం గంగాధర్, నల్ల విట్టల్, ఇందూరి సత్యం, మామిడి చిన్నారెడ్డి, గడ్డం రమేష్, కృష్ణమాచారి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

పెగడపల్లి, ఏప్రిల్ 29: గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ పేర్కొన్నారు. 138వ కార్మిక దినోత్సవ వాల్ పోస్టర్‌ను సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలో భూమేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమేశ్వర్ మాట్లాడుతూ ఆటో రవాణా కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద మరణానికి రూ 10 లక్షలు భీమాతో పాటు నెలకు ఐదు వేల రూపాయలు పెన్షన్ అందించాలని, ఉపాధిహామీ కూలీలకు 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు రూ.600 వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, ఏఐటీయూసీ మండల కన్వీనర్ రాచర్ల సురేష్, రాము, రమేష్, అంజయ్య, సంజీవ్, రాజయ్య, చంద్రయ్య, శంకర్, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లకు చెల్లుచీటి

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కథలాపూర్, ఏప్రిల్ 29: భారతీయ జనతా పార్టీకి ఓటేస్తే దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు రద్దు కావడం ఖాయమని ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సోమవారం మండలంలోని కలికోట, అంబారిపేట, తుర్తి, ఇప్పపల్లి, పోతారం గ్రామాల్లో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మద్దతుగా ర్యాలీలు నిర్వహించి రోడ్‌షోల్లో మాట్లాడారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో అభివృద్ధి తిరోగమ దిశకు చేరిందన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కలికోట సూరమ్మ చెరువు పనుల విషయంలో అనేక సార్లు నిరసనలు తెలిపామని ఎనాడైనా ఎంపీ హోదాలో బండి సంజయ్ సూరమ్మ చెరువు గురించి మాట్లాడిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. దేశంలో బీజేపీ పట్ల ప్రజలకు నమ్మకం పోయిందని ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా నాయకుడు చెదలు సత్యనారాయణ, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాదర్, కట్ట శంకర్, అల్లకొండ లింగంగౌడ్, బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

కోరుట్ల, ఏప్రిల్ 29: నిజామాబాదు బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించే విధంగా కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని యూసుఫ్‌నగర్, అయిలాపూర్, కల్లూర్ గ్రామాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో విద్యాసాగర్‌రావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం మరిచి ఇతర పార్టీలను విమర్శించడానికే సరిపోతుందని అన్నారు. నిజామాబాదు ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్ బలపరిచి గెలుపుకోసం ప్రచారం నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాదేశిక ఎన్నికలకు రంగం సిద్ధం



● ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కసరత్తు
● వచ్చే నెల 25వ తేదీ నాటికి స్థానాల పునర్విభజన
● జూన్ నెలాఖరు వరకు రిజర్వేషన్ల ప్రక్రియ
● పరిషత్ పోరుపై దృష్టి సారిస్తున్న ఆశావహులు

జగిత్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ సహా జిల్లా పరిషత్‌కు సూచనలు అందాయి. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రాదేశిక ఎన్నికలను జూన్ మాసంలో నిర్వహించాలన్న ఆలోచనతో ముందస్తు కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలో 2019 జనవరిలో సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. 2019 మే నెలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు జరిగాయి. జూన్ 3వ తేదీన ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం, జూలై 4వ తేదీన జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీనికి తోడు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. జగిత్యాల జిల్లాలో 2019 సంవత్సరంలో 204 ఎంపీటీసీ స భ్యులు, 18 జడ్పీటీసీ సభ్యులు, 380 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

● ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల పునర్విభజన..

ఐదేళ్ల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొత్తగా కొన్ని మండలాలు ఏర్పాటయ్యాయి. ఆయా మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను పునర్విభజన చేయాల్సి ఉంటుంది. మే 25 నాటికి పునర్విభజన ప్రక్రియ పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. జిల్లాలో ఇటీవల కొత్తగా బీమారం, ఎండపల్లి మండలాలు ఏర్పడ్డాయి. బండలింగాపూర్ మండల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల అయినప్పటికీ కార్యరూపం దాల్చ లేదు. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగడం, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో బండలింగాపూర్ మండల ఏర్పాటు వ్యవహారం తేలలేదు.

● జూన్ 30 నాటికి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి...

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఓబీసీ రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియను జూన్ 30 నాటికి ప్రభుత్వం పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ సూచించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణకు కావాల్సిన పింక్, తెలుపు రంగు పేపర్ వివరాలు సిద్ధం చేసి ఆయా జడ్పీలకు పంచాయతీరాజ్ కమిషన్‌కు మే 5 వరకు ప్రతిపాదనలు పంపించాలి. ఎన్నికల మార్గదర్శకాలకు సంబంధించి హ్యాండ్ బుక్స్ శిక్షణ కార్యక్రమాలకు సరిపడా పత్రాలు, పుస్తకాలను మే 31 నాటికి ముద్రించాలి. ఓటేసిన వారి చేతి వేలికి గుర్తుగా రాసే సిరా (ఇండెబుల్ ఇంక్)ను జూన్ 30 నాటికి సిద్ధం చేసుకోవాలి. అంతకు ముందే ఆయా జడ్పీలు ముందస్తు ప్రక్రియను ముగించాల్సి ఉంటుంది.

● 20 శాతం అదనంగా ముద్రణ...

తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రెండో సాధారణ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించనున్నారు. సరిపడా బ్యాలెట్ పెట్టెలు, పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ సమకూర్చుకోవాలని జడ్పీ సీఈవోలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లేఖ రాశారు. అన్ని జడ్పీలకు కలిపి పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ రూ. 1.80 లక్షల చొప్పున అవసరమని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిని చంచల్‌గూడలోని ప్రభుత్వం ప్రింటింగ్ ప్రెస్ నుంచి కొనాలని సూచించింది.

జిల్లాల వారీగా మే 15 నాటికి ప్రతి పాదనలు పంపించాలని ఆదేశించింది. 2019 ఎన్నికల ప్రకారం జగిత్యాల జిల్లా పరిధిలోని ఆయా మండలాల్లో పోలింగ్ కేంద్రాలకు పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ ఎన్ని అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అవసరమైన మొత్తం కంటే 20 శాతం అదనంగా ముంద్రించు కోవాలని ఎన్నికల సంఘం సూచించింది. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెల వివరాలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. ఎన్నికల సమయం కంటే ముందుగానే జిల్లాల వారీగా కావాల్సిన బ్యాలెట్ పెట్టెలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించే అంశాన్ని రాష్ట్ర స్థాయి అధికారులు నిర్ణయించనున్నారు. అధికార యంత్రాంగం పరిషత్ ఎన్నికల వైపు దృష్టి సారించి అవసరమైన కసరత్తులు చేస్తుండడంతో మరోవైపు ఆశావహులు పోటీకి సన్నద్ధమవుతున్నారు.

పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను గెలిపించాలి



వెల్గటూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి/వెల్లటూర్ ఏప్రిల్ 29: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంతో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం ఆయన మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. వెల్లటూర్ మండలంలోని కప్పారావుపేటలో ఉపాధి హామీ కూలీలను కలిసి చేతి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మైదానంలో క్రీడాకారులతో కలిసి కొంత సేపు వాలీబాల్ ఆట ఆడారు. ధర్మపురి పట్టణంలోని సమీకృత మార్కెట్‌ను సందర్శించారు. కూరగాయలు విక్రయించే వ్యాపారస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూరగాయల వ్యాపారుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ వ్యాపార వేత్త స్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజా సేవ చేసేందుకు ముందు ఉన్న ఆయనను ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ఆయన కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఉపాధిహామీ కూలీని రూ.400లకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అప్పం తిరుపతి, వెల్గటూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

గొల్లపల్లి, ఏప్రిల్ 29 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని అడిషనల్ ఎస్పీ భీమ్ రావు పేర్కొన్నారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలో జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ రఘుచందర్‌తో కలసి అడిషనల్ ఎస్పీ భీమ్ రావు ఫ్లాగ్ మార్చ్ ను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ సూచించిన నిబంధనల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహిస్తారని , ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలకు భరోసా కల్పించడంలో భాగంగానే పోలీసులు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. అక్రమ మద్యం, నగదు రవాణాకు సంబంధించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో డీఎస్పీ రఘుచందర్, సీఐఎస్ఎఫ్ అధికారులు, సీఐ రాంనర్సింహారెడ్డి, ఆర్.ఐ వేణు, ఎస్.ఐ సతీష్, ఆర్ఎస్ఐలు మనీష్, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

కొడిమ్యాల, ఏప్రిల్ 29: కరీంనగర్ ఎంపీగా బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ మండల నాయకులు సోమవారం మండల కేంద్రంలో, మండలంలోని పూడూర్, తురుకకాశీనగర్, బొల్లోని చెరువు గ్రామాల్లో ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, తిర్మలాపూర్ సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్, మైనార్టీ నాయకుడు చాంద్ పాషా, బీఆర్ఎస్ నాయకులు విద్యాసాగర్‌రావు, లక్ష్మారెడ్డి, రాజు, మహిపాల్ వెంకటి ఉన్నారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లితో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు గడపగడపకూ ప్రచారం చేశారు. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, చిన్నదుర్గయ్య, అశోక్, రంజిత్ ఉన్నారు.

వసతులు కల్పించేంతవరకు ఓట్లు వేయం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 29: అన్ని రకాల వసతులు కల్పించేంత వరకు ఓట్లు వేయమంటూ జగిత్యాల పట్టణ శివారులో ఉన్న నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జగిత్యాల పట్టణ శివారులోని నూకపల్లి హౌజింగ్ కాలనీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 5,420 డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేసి దాదాపు నాలుగు వేల మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు.

కనీస సౌక ర్యాలు లేకపోవడంతో సోమవారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. నాయకులు పట్టించుకొని వసతులు కల్పించేంత వరకు ఓట్లు వేయమని తమ ఆవేదనను వెలిబుచ్చారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

బండి సంజయ్‌ను గెలిపించాలి

మల్యాల, ఏప్రిల్ 29: కరీంనగర్ ఎంపీగా మరోసారి బండి సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ మల్యాలలో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మల్యాలలో మండలం కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ మోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని అన్నారు. నేరెళ్ల శ్రావణ్ కుమార్, గాజుల మల్లేశం, డబ్బు గోవర్ధన్‌రెడ్డి, రమ, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

మల్లాపూర్, ఏప్రిల్, 29: మండలంలోని ఓబులాపూర్, మొగిలిపేట, రాఘవపేట గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మల్లేశం తనిఖీ చేశారు. సోమవారం కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు, రికార్డులు, కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శుద్ధి చేసిన నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చి ఏ గ్రేడ్‌కు రూ. 2203, సాధరణ రకానికి రూ. 2183 మద్ధతు ధరను పొందాలన్నారు. కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, రైతుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఏపీఎం దేవరాజ్, వీవోఏలు లావణ్య, రమ్య, నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీవన్ రెడ్డి ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదు

నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

రాయికల్/బీర్‌పూర్ ఏప్రిల్ 29: నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న జీవన్ రెడ్డి 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు చేసిన గొప్ప మేలు ఏమీ లేదని, హిందూ వ్యతిరేకిగా మారిన ఆయనకు ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. రాయికల్ మండలంలోని మైతాపూర్, బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో సోమవారం బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. తాను గతంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు మోదీ కాళ్లు మొక్కి పసుపు బోర్డు సాధించానని, ఇప్పుడు నేను ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని నెల రోజుల్లో తెరిపిస్తానని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పూర్తి లెక్కలు చెప్పి తనకు సహకరించాలని సూచించారు. ఆరు గ్యారెంటీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీలోకి తొంగి చూస్తున్నారని, ఆయన చేరే అవకాశం ఉందని వాళ్ల పార్టీ వారే అంటున్నారని, ఎంపీ లు గెలిచే సత్తా పార్టీకి లేకపోవడంతో రిజల్ట్ రాగానే ఆయన చేరిక ఉంటుందని కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బోగ శ్రావణి, పడాల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టితో గెలిపించాలి

మెట్‌పల్లి, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలిపి అత్యధిక మెజార్టితో గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రజలను కోరారు. సోమవారం పట్టణంలోని జాతీయ రహదారి వెంట ర్యాలీగా వ్యాపార సంస్థలు, దుకాణదారులకు కరపత్రాలను అందజేసి బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందన్నారు. నిరంతరం ప్రజలు మధ్య ఉండి సమస్యల కోసం పోరాటం చేసే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. నాయకులు ఓజ్జెల శ్రీనివాస్, ధ్యావనపల్లి రాజారాం, లంక గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా జీవన్‌రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలి

కోరుట్ల, ఏప్రిల్ 29: నిజామాబాదు ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం పట్టణం కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు జీవన్‌రెడ్డిని గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జీవన్ రెడ్డికి మద్దతు పలికి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మోర్తాడ్ లక్ష్మీనారాయణ. సేవాదళ్ కన్వీనర్ నరహరి, సోగ్రాబీ, వీరబత్తిని దశరథం, కటుకం దివాకర్, వనతపుల వెంకటేష్, తాటిపల్లి శ్రీనివాస్, అనంద్ గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మూడోసారి మోదీ వస్తేనే మరింత 'ఉపాధి'

కథలాపూర్, ఏప్రిల్ 29: నరేంద్రమోదీని దేశానికి మూడోసారి ప్రధానమంత్రిని చేస్తే ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తక్కళ్ళపల్లిలో సోమవారం ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల వద్దకు వెళ్లి కూలీలను ఓట్లు అభ్యర్థించారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి రెండోసారి బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ కూలీలను కోరారు. సందర్భంగా జిల్లా సత్యం, లింగారెడ్డి, తోట గంగారెడ్డి, నవీన్, లింగేశర్, ప్రకాశ్, మోహన్ తదితరులు ఉన్నారు.

కవితకు పట్టిన గతే ఎంపీ అర్వింద్‌కు పడుతుంది

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్



మాట్లాడుతున్న మధు యాష్కీ గౌడ్

మెట్‌పల్లి, ఏప్రిల్, 29: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట తీరు, వ్యవహారశైలిని మార్చుకోకుండా అహంకారంతో తిరిగితే కవితకు పట్టన గతే ఆయనకు పడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మళ్లీ మోదీకి ఓటు వేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, రిజర్వేషన్లతో పాటు మైనార్టీ రిజర్వేషన్లనూ వ్యతిరేకించిన ఆర్ఎస్ఎస్, బీజేపీ లకు వేసినట్లేనని అన్నారు. ఎంపీ అర్వింద్ తీరు మార్చుకోకుంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మే 1న చౌలమద్ది శివారులోని సీఎం రేవంత్ సభకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కొమిరెడ్డి లింగారెడ్డి, ఆకుల లింగారెడ్డి, పూదరి నర్సాగౌడ్, కొమ్ముల సంతోష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బీరయ్య స్వామి కల్యాణం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 29: మండలంలోని చిన్నమెట్‌పల్లి బీరయ్య స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి వేడుకలను నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సింగిల్‌విండో చైర్మన్ భూమయ్య, నాయకులు ముత్తయ్య, రాజేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

సంక్షిప్త సమాచారం..

జగిత్యాలరూరల్: మండలంలోని తిప్పన్నపేటలో గల హన్‌మాన్ ఆలయ సమీపంలో గల మహావృక్షాన్ని గ్రామ పంచాయతీ అనమతులు లేకుండా నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ డిమాండ్ చేశారు.

పెగడపల్లి: నిత్యం ప్రజల కోసం పరితపించే ప్రజా సేవకుడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఏడుమోటలపల్లి, తండా గ్రామాల్లో బీఆర్ఎస్ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని జైనాలో గల రామలింగేశ్వర స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ద్యావళ్ల ప్రసన్నకు మార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని కోండ్రికర్ల మాజీ ఉపసర్పంచు ఆకుల శ్రీనివాస్ గంటల వ్యవధిలోనే సొంత గూటికి చేరుకున్నారు. సోమవారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరగా గంటల వ్యవధిలోనే సాయంత్రం మళ్ళీ సొంత గూటి బీజేపీ కండువా కప్పు కున్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్‌లో బీజేపీ నాయకులు అర్వింద్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారంను నిర్వహించారు. నిజామాబాదు ఎంపీగా ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కోరారు.మాజీ సర్పంచ్ లింగారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో అంగన్‌వాడి టీచరుగా పని చేస్తున్న చెన్న కళ్యాణి అనారోగ్యంతో భాదపడుతూ సోమవారం మృతి చెందంగా అంతిమ సంస్కారానికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూ. 20,000 ఆర్థిక సాయం అందించారు.

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో మాట్లాడారు.

మెట్‌పల్లి: మున్సిపల్ కార్మికుల పీఆర్‌సీని వెంటనే విడుదల చేయాలని మెట్‌పల్లి పురపాలక కమిషనర్ మోహన్‌కు కార్మికులు వినతి ప్రతం అందజేశారు.

- మెట్‌పల్లి పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు డాక్టర్ రాఘవేంద్రరావు తండ్రి చిట్నేని కిషన్‌రావు ఇటీవల మృతి చెందడంతో మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు నివాళులర్పించారు. సోమవారం డాక్టర్ రాఘవేంద్ర నివాసంలో కిషన్‌రావు సంస్మరణ సభ నిర్వహించగా మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కిషన్‌రావు చిత్రపటానికి నివాళులర్పించి సానుభూతి వ్యక్తం చేశారు.